సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 25 । అక్టోబర్ । 2023



రసవత్తరంగా కబడ్డీ పోటీలు

దసరా సందర్భంగా నూజివీడులో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. నేడు ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. 8లో ▸



కిటకిటలాడిన మద్ది క్షేత్రం

జంగారెడ్డిగూడెం రూరల్: దసరా సందర్భంగా మద్ది ఆంజనేయస్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.



వేగివాడలో వ్యక్తి హత్య

పెదవేగి మండలం వేగివాడలో సోమవారం అర్ధరాత్రి ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. వివాహేతర సంబంధం నేపథ్యంలో హత్య జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

ఆర్టీసీ 'వెన్నెల' బస్సు ప్రారంభం



తణుకులో ఆర్టీసీ వెన్నెల ఏసీ స్లీపర్ బస్సును ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీలో ప్రత్యేక సౌకర్యాలు ఉన్న బస్సులు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు ఆర్టీసీ డిపోలో మంగళవారం హైదరాబాద్ వెళ్లేందుకు నూతనంగా ఏర్పాటుచేసిన వెన్నెల ఏసీ స్లీపర్ బస్సును మంత్రి కారుమూరి ప్రారంభించారు. ఇంతవరకు ప్రైవేటులో మాత్రమే ఉన్న ఏసీ స్లీపర్ బస్సులను ఆర్టీసీలో కూడా ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి చరిత్ర సృష్టించారని, ఆ రోజు నుంచి ఆర్టీసీలో ఎన్నో నూతన ఆవిష్కరణలు తీసుకువస్తున్నారని స్పష్టం చేశారు. ఉమ్మడి గోదావరి జిల్లాకు సంబంధించి మొట్టమొదటగా తణుకు డిపోకే ఈ బస్సు సౌకర్యాన్ని కల్పించారని చెప్పారు. ఆర్టీసీ కార్గో సేవలు రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ఉన్నాయని మంత్రి అన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లోని కార్గో సెంటర్‌లో కార్గో మాసోత్సవాల డోర్ డెలివరీ గోడ పత్రికలను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 87 ప్రాంతాల్లో 10 కిలోమీటర్ల మేర కార్గో డోర్ డెలివరీ ద్వారా ఇంటి గుమ్మంలోకే పార్సిల్స్ అందజేస్తున్నారని చెప్పారు. ప్రయాణికులకు ఆర్టీసీ అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్టీసీ తణుకు డిపో మేనేజరు సప్పా గిరిధరకుమార్, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రీజనల్ కోఆర్డినేటర్ చినిమిల్లి వెంకటరాయుడు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, దువ్వ సర్పంచ్ అడ్డా బాబు, వై.రమేష్, చింతలపూడి సూర్యనారాయణ పాల్గొన్నారు.

14 నుంచి కార్తీక మాసోత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రామలింగేశ్వర స్వామి దేవస్థానం ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నవంబర్ 14 నుంచి స్థానిక పత్తేబాద శ్రీ చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసోత్సవాలు నిర్వహించడానికి నిర్ణయించినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి డీ.శంకరరావు తెలిపారు. కార్తీక మాసోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను సోమవారం దేవస్థానంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ డిసెంబర్ 12 వరకూ కార్తీక మాసోత్సవాలు దేవస్థానంలో నిర్వహిస్తామని, ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతీ సోమవారం ప్రత్యేక మహన్యాస పూర్వక అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. ప్రత్యేక రోజుల్లో కార్తీక పౌర్ణమి సందర్భంగా నవంబర్ 26న జ్వాలా తోరణ పూజలు, ఆరుద్ర నక్షత్రం సందర్భంగా 30న మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్ష బిల్వార్చన, జ్యోతిర్లింగార్చన నిర్వహిస్తామన్నారు. చిత్ర నక్షత్రం సందర్భంగా డిసెంబర్ 8వ తేదీన అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తామని తెలిపారు. డిసెంబర్ 10న స్వామికి శాంతి కళ్యాణం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్టుబోర్డ్ ఛైర్మన్ బళ్ళ రవికుమార్, ట్రస్టీలు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఆశ్వీయుజ మాస శ్రవణా నక్షత్ర మహోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసునికి కల్యాణోత్సవం ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. విజయదశమి సందర్భంగా విశేష సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఈవో మానికల రాంబాబు పర్యవేక్షించారు.



నూతన వస్త్రాలను అందిస్తున్న ఈఓ



డిప్యూటీ సీఎంకు శ్రీవారి చిత్రపటం బహూకరణ



వేడుకలో ఆలయ పండితులు, ఆగమ విద్యార్థులు



శ్రీ మహావిష్ణు అలంకారంలో దర్శనమిస్తున్న శ్రీవారు



శ్రీవారిని పెండ్లి కుమారుడు, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా చేస్తున్న అర్చకులు

బ్రహ్మోత్సవ శోభ

- పెండ్లి కొడుకైన శ్రీవారు
- అట్టహాసంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- శ్రీ మహావిష్ణు అలంకారంలో దర్శనం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా స్వామివారిని పెండ్లి కుమారుడు, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలను చేయు వేడుక శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో వైభవంగా జరిగింది. ముందుగా ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి తొళక్క వాహనంపై తీసుకెళ్లి, మండపంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై వేంచేపు చేశారు. అనంతరం సర్వాభరణ భూషితులైన శ్రీవారు, అమ్మవార్లకు అర్చకులు బుగ్గన చుక్క, కల్యాణ తిలకాలను దిద్దగా, ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను, పూలు, పండ్లను సమర్పించారు. ఆ తరువాత పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేయు వేడుక నిర్వహించారు. కనుల విందుగా ఈ కార్యక్రమం సాగింది. ఆఖరిలో అర్చకులు, పండితులకు ఈఓ దంపతులు నూతన వస్త్రాలను అందజేశారు. అలాగే ముఖ మండపంలో ఉభయ దేవేరులతో స్వామివారు శ్రీ మహా విష్ణు అలంకారంలో దర్శనమిచ్చి భక్తులను అనుగ్రహించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

- రాత్రి ధ్వజారోహణ, వెండి శేషవాహనంపై శ్రీవారి తిరువీధి సేవ
- ఉదయం 8.30 నుంచి రాత్రి 9 గంటల వరకు వేద పారాయణం, సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రత్యేక అలంకారం:
ద్వారకా కృష్ణ అలంకారం

సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు

- రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో వేగవంతం
- ఫేజ్-2లో 17 సచివాలయల్లో సేవలు
- ఫేజ్-3లో 51 గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు

జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాలు	సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు	రిజిస్ట్రేషన్ సౌకర్యాలు ఉన్న సచివాలయాలు
535	15	69



రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతున్న పెదపుల్లేరు గ్రామ సచివాలయం

భీమవరం (ప్రకాశంచౌక్): సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. భూముల రిజిస్ట్రేషన్లతో పాటు ఇతర రిజిస్ట్రేషన్లు కూడా అందుబాటులోకి తీసుకువచ్చింది. ముఖ్యంగా రీ సర్వే పూర్తయిన గ్రామాల్లోని సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు ఏర్పాటు చేసి సర్వే చేసిన భూములు రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. జిల్లాలో మొదటిగా ఉండి మండలం పెదపుల్లేరు గ్రామ సచివాలయంలో రిజిస్ట్రేషన్ సేవలను ఏర్పాటు చేశారు. ఫేజ్-2లో జిల్లాలోని 17 గ్రామ సచివాలయాలను ఎంపిక చేసి రిజిస్ట్రేషన్ సేవలు నిర్వహిస్తున్నారు. తాజాగా జిల్లాలో మరో 51 గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు ఏర్పాటు చేయనున్నారు. ఇంతవరకూ భూములకు సంబంధించి 150 రిజిస్ట్రేషన్ సేవలు అందించారు.

ఎల్‌పీ నెంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్

జిల్లాలో రీ సర్వే పూర్తయిన గ్రామాల్లోని భూములను స్థానిక సచివాలయాల్లో ఎల్‌పీ (ల్యాండ్ పార్సిల్) నెంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. మొన్నటి వరకూ భూములను సర్వే నెంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేశారు. ప్రభుత్వం భూముల రీ సర్వే తర్వాత స్థానిక సచివాలయాల్లో ఆ భూముల్ని రిజిస్ట్రేషన్ చేస్తుంది. పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి సచివాలయాలకు ఎప్పటికప్పుడు రిజిస్ట్రేషన్లపై సూచనలు, సలహాలు, సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నారు.

స్థానిక రిజిస్ట్రేషన్లతో ప్రయోజనాలు

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు అందుబాటులోకి తీసుకురావడంతో రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఇప్పటి వరకూ రిజిస్ట్రేషన్ల కోసం గ్రామాల నుంచి స్థానిక పట్టణాలు లేదా మండల కేంద్రాలకు వెళ్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గంటల తరబడి వేచి చూసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిన పరిస్థితి ఉండేది. రిజిస్ట్రేషన్లుకు సంబంధించి కొంత మంది బ్రోకర్లు మధ్యవర్తిగా వ్యవహరించి కమిషన్లు తీసుకుని రిజిస్ట్రేషన్లు చేయించేవారు. దాంతో రెండు పార్టీలు కూడా ఆర్థికంగా నష్టపోయేవారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ తీసుకురావడంతోపాటు సచివాలయాలను సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులుగా చేయడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభమైంది. వ్యయ ప్రయాసలు లేకుండా స్థానికంగానే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకునే సౌకర్యం కల్పించారు. దూర ప్రాంతాలకు వెళ్లి రిజిస్ట్రేషన్లు చేసుకునే భారం తగ్గింది. నూతన పద్ధతిలో భూములకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కలిగింది.

ఫేజ్-3లో 51 సచివాలయాల్లో సేవలు



జిల్లాలో ఫేజ్-3లో 51 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటి వరకూ 18 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు నడుస్తున్నాయి. భూ రీ సర్వే పూర్తయిన గ్రామాల సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. ఎల్‌పీ నెంబర్లపై భూముల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.

– ఆర్.సత్యనారాయణ, జిల్లా రిజిస్ట్రార్

213 గ్రామాల్లో రీ సర్వే పూర్తి

జిల్లాలో 213 గ్రామాల్లో భూముల రీ సర్వే పూర్తి చేశారు. ఫేజ్-1లో 16 మండలాల్లో 16 గ్రామాలు, ఫేజ్-2లో 12 మండలాల్లో 93 గ్రామాలు, ఫేజ్-3లో 20 మండలాల్లో 104 గ్రామాల్లో సర్వే పూర్తి చేశారు. ఈ గ్రామాలకు సంబంధించి ఇప్పటి వరకూ 69 గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులో ఉంచారు. రీ సర్వే పూర్తయిన ప్రతి గ్రామ సచివాలయంలో సబ్ రిజిస్ట్రార్ సేవలను దశలవారీగా ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

బలుసులమ్మ ఆలయంలో పుష్కరిణి ప్రారంభం



బలుసులమ్మ ఆలయ ప్రాంగణంలో పుష్కరిణి ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెం పురదేవత శ్రీ బలుసులమ్మ అనుగ్రహంతో ప్రజలు సంతోషంగా ఉండాలని ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆకాంక్షించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన పుష్కరిణిని మంత్రి కొట్టు సత్యనారాయణ సోమవారం రాత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. దసరా సందర్భంగా అమ్మ వారి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించడం సంతోషంగా ఉందంటూ ఆలయ కమిటీకి అభినందనలు తెలిపారు. ఉత్సవాలలో మూల నక్షత్రం సందర్భంగా సుమారు 2,500 మంది విద్యార్థులు సరస్వతీ దేవికి పూజలు నిర్వహించారని, వారికి నోటు పుస్తకాలు అందచేశామన్నారు. విద్యార్థులందరూ ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆభిలషించారు. బలుసులమ్మ ఆలయ అభివృద్ధిలో విరాళాలు అందించిన భక్తులకు అభినందనలు తెలిపారు. అమ్మవారి ఆలయాన్ని దివ్య క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. అమ్మవారికి హంసవాహనంపై తెప్పోత్సవం నిర్వహించేందుకు ఆలయ ప్రాంగణంలోనే పుష్కరిణి నిర్మించినట్లు తెలిపారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించేందుకు ప్రత్యేకంగా వంటశాలను, యజ్ఞయాగాదులు నిర్వహించేందుకు యాగశాల, భక్తులకు అన్నప్రసాద వితరణకు భోజనశాల, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించేందుకు విశాలమైన పూజాప్రాంగణం, ప్రవచన మండపం తదితర ప్రత్యేక వసతులు కల్పిస్తున్నామన్నారు.

చంద్రబాబు ప్రజలకు చేసిందేమీ లేదు

- టీడీపీ, జనసేనలకు ఓట్లు అడిగే అవకాశం లేదు
- మంత్రులు పినిపే, కారుమూరి



ద్వారకాతిరుమల మండలం సీహెచ్ పోతేపల్లి సభలో మాట్లాడుతున్న రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్. చిత్రంలో మంత్రి కారుమూరి, ఎంపీలు మార్గాని భరత్, కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే తలారి

ద్వారకాతిరుమల: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కంటే ముందే చంద్రబాబు రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయినప్పటికీ ఆయన ప్రజలకు చేసిందేమీ లేదని, అందుకే చెప్పుకోవడానికి ఏమీ మిగల్లేదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలంలోని సీహెచ్ పోతేపల్లి, కోడిగూడెం గ్రామాల్లో గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో మంగళవారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు జరిగాయి. అందులో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఏలూరు, రాజమండ్రి ఎంపీలు కోటగిరి శ్రీధర్, మార్గాని భరత్‌రామ్, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీలతో కలసి విశ్వరూప్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభలో విశ్వరూప్ మాట్లాడుతూ దివంగత సీఎం ఎన్టీఆర్ పేరు చెబితే మండల వ్యవస్థ, రూ. 2కే కిలో బియ్యం గుర్తుకొస్తాయని చెప్పారు. ఆ తరువాత దివంగత వైఎస్సార్ పేరు చెబితే ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్ గుర్తుకొస్తాయన్నారు. చంద్రబాబు పేరు చెబితే ఏమీ గుర్తుకు రావని, ఎందుకంటే ఆయన చేసిందేమీ లేదని చెప్పారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు చెబితే అమ్మ ఒడి, 45 ఏళ్లు నిండిన మహిళలకు చేయూత పథకం, నాడు-నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి, ఇలా అనేక సంక్షేమ కార్యక్రమాలు గుర్తుకొచ్చేలా పాలన సాగుతోందన్నారు.

దుర్గా మాత వద్ద భువనేశ్వరి ప్రమాణం చేయాలి

కారుమూరి మాట్లాడుతూ జగన్ సంక్షేమ పాలన కారణంగా టీడీపీ, జనసేన పార్టీలకు ఓట్లడిగే అవకాశం కూడా లేదన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీలనివ్వకుండా చూస్తానని పవన్ కల్యాణ్ అంటున్నారని, అసలు జగన్‌కు వ్యతిరేక ఓటే లేదని ఆయన చెప్పారు. ప్రతిపక్షాలు భ్రమల్లో బతుకుతున్నాయని ఈ సందర్భంగా ఆయన ఎద్దేవా చేశారు. రెండెకరాలున్న చంద్రబాబుకు లక్ష కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఆ భూమిలో వజ్రాలు పండించారా అంటూ ఎద్దేవా చేశారు. బాబు అవినీతి చేయలేదని దుర్గమ్మ అమ్మవారి వద్ద ఆయన భార్య భువనేశ్వరి ప్రమాణం చేయాలన్నారు.

టీడీపీలోకి మాత్రం వెళ్లొద్దన్నారు

ఎంపీ శ్రీధర్ మాట్లాడుతూ తన తండ్రి, మాజీ మంత్రి విద్యాధరరావు దాదాపు 30 ఏళ్లు టీడీపీని భుజంపై మోశారన్నారు. పార్టీలో నిరంతర పోరాటం చేసేవారని, ఒక్కరోజు కూడా తృప్తిగా పడుకోలేదని చెప్పారు. ఆ పోరాటం ప్రతిపక్షంతోనో, ప్రత్యర్థులతోనో కాదని, కేవలం టీడీపీ కార్యకర్తలతోనే చేశారని తెలిపారు. తన తండ్రి ఆఖరి రోజుల్లో తనను రాజకీయాల్లోకి రావాలని చెప్పారని, టీడీపీలోకి మాత్రం వెళ్లొద్దన్నారని వివరించారు. ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ సైకిల్ సవారీకి అద్దె కొడుకును తెచ్చుకున్నారని చెప్పారు. ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ తప్పు చేసి జైలుకు వెళ్లబట్టే చంద్రబాబుకు ప్రజల్లో కనీస సానుభూతి కూడా రాలేదన్నారు. బాబుకు వచ్చే ఎన్నికలు చివరి ఎన్నికలవుతాయని స్పష్టం చేశారు. ప్రజల మన్ననలు పొందలేని నాయకుడు పాతాళంలో కలిసిపోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, స్థానిక సర్పంచ్ పోల్కంపల్లి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 14 ఆరోగ్య సురక్ష క్యాంపుల నిర్వహణ

భీమవరం(ప్రకాశం చౌక్): బుధవారం జిల్లా వ్యాప్తంగా 14 మండలాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు తెలిపారు. తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం, గణపవరం మండలం కొత్తపల్లి, పెంటపాడు మండలం ఆకుతీగపాడు, ఇరగవరం మండలం రేలంగి, అత్తిలి మండలం పాలూరు, ఉండి మండలం ఆర్తమూరు, కాళ్ల మండలం పెదఅమిరం, పాలకోడేరు మండలం పెన్నాడ అగ్రహారం, పెనుగొండ మండలం దేవ, ఆచంట మండలం కరుగోరుమిల్లి, పాలకొల్లు మండలం పాలకొల్లు గ్రామీణ యలమంచిలి మండలం కనకాయలంక, నర్సాపురం మండలం సారవ, మొగల్తూరు మండలం కాళీపట్నం తూర్పులో నిర్వహిస్తారు.

ఘనంగా తెప్పోత్సవం



తెప్పోత్సవంలో పూజలు చేస్తున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ తదితరులు

తణుకు టౌన్: దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా శ్రీ దానేశ్వరి అమ్మవారి తెప్పోత్సవం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో వేంచేసియున్న శ్రీ దానేశ్వరి అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారం సాయంత్రం గ్రామంలో అమ్మవారికి భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని వయ్యేరులో అమ్మవారి కోసం ప్రత్యేకంగా తయారు చేసిన తెప్పపై తెప్పోత్సవం నిర్వహించారు. తెప్పోత్సవంలో పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్‌లు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, సర్పంచ్ అడ్డా బాబు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గోపాలకృష్ణ, ఆలయ ఈవో ఎం.సత్యనారాయణ, ఆలయ సిబ్బంది, నాయకులు, భక్తులు పాల్గొన్నారు. దసరా వేడుకల సందర్భంగా తణుకు రూరల్ మండలం వేల్పూరులోని వివిధ ఆలయాల్లో మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీలు చంద్రు శ్యామల, విజయదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం ఆర్డీవో బదిలీ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఆర్డీవో డాక్టర్ ఎం.ఝాన్సీరాణి బదిలీ అయ్యారు. ఈ మేరకు ఈ నెల 22న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె స్థానంలో గురజాల ఆర్డీవోగా పనిచేస్తున్న కె.అద్దయ్య జంగారెడ్డిగూడెం ఆర్డీవోగా నియమితులయ్యారు. ఝాన్సీ రాణి కొవ్వూరు ఆర్ఎంసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

రేపు చెస్ పోటీలు ప్రారంభం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో మాస్టర్స్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ర్యాపిడ్ చెస్ పోటీలు ఈ నెల 26న తాడేపల్లిగూడెం పట్టణంలోని గుణ్ణం ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతాయని అకాడమీ సెక్రటరీ, కోచ్ ఎస్.ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. చెస్ కోచింగ్ సెంటర్ వద్ద మంగళవారం టోర్నమెంట్ కరపత్రాలు విడుదల చేశారు. పోటీల్లో ఏ వయస్సు వారైనా పాల్గొనవచ్చునని తెలిపారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

తాడేపల్లిగూడెం: బాదంపూడి-తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్ల మధ్య కడకట్ల ఇటుక బట్టీల ప్రాంతంలో రైలు ఢీకొని 70 సంవత్సరాల వయస్సు కలిగిన వృద్ధురాలు సోమవారం మృతి చెందింది. విశాఖ వైపు వెళ్లే రైలు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్టుగా గూడెం రైల్వే పోలీసులు చెబుతున్నారు. మృతురాలి శరీరంపై లైట్‌ముక్కుపొడుం రంగుపై తెలుపు, లైట్ నీలం రంగు పువ్వుల డిజైన్‌తో ఉన్న చీర, లైట్ నీలంరంగు జాకెట్ తెలుపు రంగు లంగా ధరించి ఉంది. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో మార్చురీకి తరలించారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు రైల్వే ఎస్సై జి.శ్రీహరిబాబు 94906 17090 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

27 నుంచి జిల్లా జట్ల ఎంపిక

జంగారెడ్డిగూడెం: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 2023–24 సంవత్సరానికిగాను అండర్–14, –17 జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక పోటీలను ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి డి.రాజేంద్రప్రసాద్, పి.మల్లేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న తాడేపల్లిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో ఖోఖో, చదరంగం, 28న బ్రాహ్మణగూడెం జెడ్పీ హైస్కూల్‌లో బాలికల బాల్‌బ్యాడ్మింటన్ జట్టు ఎంపికలు జరుగుతాయన్నారు. చదరంగం ఎంపిక పోటీలకు హాజరయ్యే వారు ఫారం–బి, మిడ్‌డే మీల్స్ ఎక్విటెన్స్, ఇంటర్ విద్యార్థులు 10వ తరగతి మార్కుల జాబితాపై కళాశాల ప్రిన్సిపాల్‌తో సంతకం చేయించి తీసుకురావాలన్నారు.

చికిత్స పొందుతూ కూలీ మృతి

ఉంగుటూరు: పొలంలో గడ్డి కోస్తుండగా పాము కాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ కూలీ సోమవారం రాత్రి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కాగుపాడు గ్రామానికి చెందిన రేగులబంద సూర్యారావు (49) ఈనెల 20న పొలంలో గడ్డి కోస్తుండగా పాము కాటువేసింది. స్థానిక పీహెచ్‌సీకి, అక్కడనుంచి తాడేపల్లిగూడెం ప్రభుత్వం ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యుల సిఫారసు మేరకు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి సూర్యారావు మృతి చెందారు. చేబ్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విజయములీయవే.. తల్లీ

చేపట్టిన పనుల్లో విజయములీయవే అంటూ భక్తులు అమ్మవార్లను ప్రార్థించారు. ఉమ్మడి జిల్లాలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు ఆలయాల్లో అమ్మవార్లను మంగళవారం రాజరాజేశ్వరి దేవిగా అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్




భీమవరం (ప్రకాశంచౌక్): రాజరాజేశ్వరి దేవి అలంకరణలో మావుళ్లమ్మ, వనదుర్గా దేవి అలంకరణలో పార్వతీ అమ్మవారు



పెనుగొండ: ఉగ్రరూపంలో మహిషాసురమర్దని



పెనుగొండ: వాసవీ శాంతి ధాంలో మహిషాసురమర్దనీగా వాసవీ మాత



ద్వారకాతిరుమల: రాజరాజేశ్వరి దేవిగా దర్శనమిచ్చిన కుంకుళ్లమ్మ



ద్వారకాతిరుమల: కుంకుళ్లమ్మ రథోత్సవం దృశ్యం

వేగివాడలో వ్యక్తి దారుణ హత్య



రమేష్ (ఫైల్)



తీవ్ర గాయాలతో ఉన్న రమేష్

పెదవేగి: వేగివాడలో సోమవారం అర్ధరాత్రి ఓ వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. పెదవేగి ఇన్‌చార్జ్ సీఐ బాల సురేష్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేగివాడకు చెందిన నల్లమిల్లి రమేష్ (35), అదే గ్రామానికి చెందిన రిబ్కా పదకొండేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి 9, 10 ఏళ్ల వయస్సు కలిగిన ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. కొంతకాలంగా రమేష్, రిబ్కాల మధ్య మనస్పర్థలు రావడంతో ఆరునెలలు ఇద్దరూ వేర్వేరుగా ఉన్నారు. ఇరువైపు పెద్దలు వీరితో మాట్లాడి సర్దిచెప్పగా, నాలుగు రోజుల క్రితం రిబ్కాను భర్త రమేష్ వద్దకు పంపించారు. ఇదిలా ఉండగా, వేగివాడ సమీపంలో ఉన్న కె.కన్నాపురం గ్రామానికి చెందిన కమ్మిలి శ్రీనివాస్ అనే వ్యక్తి సోమవారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో వేగివాడ వచ్చి నల్లిమిల్లి రమేష్ ఇంటికి వెళ్లాడు. అలికిడికి రమేష్ బయటకు రాగా వెంటనే అతనిపై నల్లమిల్లి శ్రీనివాస్ పామాయిల్ గెలలు కోసే కత్తితో విచక్షణా రహితంగా దాడి చేశాడు. తల, చేతులపై నరకడంతో తీవ్రగాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న రమేష్‌ను తొలుత ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ సర్వజన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రమేష్ మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పెదవేగి ఇన్‌చార్జి సీఐ బాల సురేష్, ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపారు.

వివాహేతర సంబంధమే కారణమా ?

వివాహేతర సంబంధం కారణంగానే ఈ హత్య జరిగిందని బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ కారణంగానే రమేష్ కుటుంబంలో తరచుగా గొడవలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. రిబ్కా భర్త రమేష్‌తో గొడవపడి ఆరునెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయిందని, పెద్దలు రాజీకుదిర్చడంతో వ్యవహారం సద్దుమణిగిందంటున్నారు. అయితే రమేష్ హత్యకు గురికావడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. వివాహేతర సంబంధం కారణంగానే రమేష్ హత్యకు గురైనట్లుగా బంధువులు ఆరోపిస్తున్నారు.

అత్యాచారయత్నం కేసులో నిందితుడి అరెస్టు

పాలకోడేరు: అత్యాచారయత్నం కేసులో పరారీలో ఉన్న ఓ నిందితుడిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఓ మహిళపై కుముదవల్లికి చెందిన మహ్మద్ అంజాద్ ఖాన్ రెండు నెలల క్రితం అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అంజాద్ ఖాన్ అప్పటినుంచి పరారీలో ఉండగా, మంగళవారం ఉదయం అతనిని అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు చెప్పారు.

గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురికి రిమాండ్

పాలకోడేరు: గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు చెప్పారు. వేంద్రలోని డెల్టా పేపర్ మిల్ వద్ద మంగళవారం చినమల్లంకు చెందిన బొంతు రామకృష్ణ (38), పండితవిల్లూరుకు చెందిన కండెల్లి దుర్గాప్రసాద్ (28), రాయకుదురుకు చెందిన యార్లగడ్డ అశోక్ (19)లను అరెస్టు చేసి వారి నుంచి 4.50 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను మంగళవారం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

స్వస్థలాలకు రెండు మృతదేహాల తరలింపు

ఇంకా లభ్యం కాని వసంత్‌కుమార్ జాడ



బీచ్‌లో గాలింపు చర్యలు చేపడుతున్న పోలీసులు, మత్స్యకారులు

తణుకు: తణుకు నుంచి విహార యాత్రగా పేరుపాలెం బీచ్‌లో స్నానానికి దిగి సముద్ర అలలకు కొట్టుకుపోయి గల్లంతైన ముగ్గురిలో ఇద్దరి మృతదేహాలను సోమవారం స్వస్థలాలకు తరలించారు. తణుకు పట్టణానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన 14 మంది రెండు ఆటోల్లో విహార యాత్ర పేరుతో పేరుపాలెం బీచ్‌కు ఆదివారం వెళ్లారు. వీరిలో అనుపోజు రఘువర్మ (20), గోరస నాగ శ్రీలక్ష్మి సావిత్రి (38)తోపాటు ఉంగుటూరు మండలం బాదంపూడి గ్రామానికి చెందిన అనుపోజు వసంత్‌కుమార్ (19), తన్మయి, శ్రీవాణి సముద్ర స్నానానికి దిగారు. వీరిలో రఘువర్మ, సావిత్రి, వసంత్‌కుమార్ అలలకు కొట్టుకుపోగా రఘువర్మ, సావిత్రి మృతదేహాలను వెలికితీశారు. అయితే మంగళవారం రాత్రి వరకు గాలించినా వసంత్‌కుమార్ ఆచూకీ లేకపోవడంతో ఆ కుటుంబం తల్లడిల్లుతోంది. నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో రఘువర్మ, సావిత్రి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి సోమవారం బంధువులకు అప్పగించారు. తీవ్ర అస్వస్థతకు గురై భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తన్మయి, శ్రీలక్ష్మి కోలుకోవడంతో తన్మయి ఇంటికి చేరుకున్నారు. ఈ సంఘటన మూడు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది.



వసంత్‌కుమార్ (ఫైల్)



శ్రీలక్ష్మి సావిత్రి (ఫైల్)



రఘువర్మ (ఫైల్)

ఇంకా లభ్యం కాని వసంతకుమార్ జాడ

నరసాపురం రూరల్: పేరుపాలెం బీచ్ సముద్రంలో ఆదివారం గల్లంతైన యువకుడు అనుపోజు వసంతకుమార్ (18) జాడ ఇంకా లభ్యం కాలేదు. పోలీసు, ఫైర్, కోస్టుగార్డు, మెరైన్ పోలీసులు సోమ, మంగళవారం తీవ్రస్థాయిలో గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఫలితం లేకపోయింది. మృతదేహం ఒడ్డుకు కొట్టుకు వచ్చే అవకాశం ఉన్నందున మంగళవారం ఇటు తూర్పు గోదావరి జిల్లా సఖినేటిపల్లి నుంచి మొదలుకుని కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలంలోని గొల్లపాలెం, బాపట్ల వరకు మత్స్యకారులు, సముద్రతీర ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులకు సైతం సమాచారం అందించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ముమ్మరంగా గాలించడం, ఆరా తీస్తున్నామని మొగల్తూరు ఎస్సై ఎం.వీరబాబు చెప్పారు. ఇదిలా ఉండగా ఇదే ప్రమాదంలో భీమవరంలో చికిత్స పొందున్న అనుపోజు శ్రావణి, గొరస తన్మయి పరిస్థితి మెరుగ్గా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

నూజివీడులో రసవత్తరంగా కబడ్డీ పోటీలు

- లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహణ
- నేడు ఫైనల్స్ మ్యాచ్‌లు



పోటీలో తలపడుతున్న కృష్ణా-గుంటూరు జట్ల క్రీడాకారులు

నూజివీడు: దసరా సందర్భంగా నూజివీడులో నిర్వహిస్తున్న 71వ మహిళల, పురుషుల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. స్పోర్టింగ్ క్లబ్ ఆధ్వర్యంలో లీగ్ కం నాకౌట్ పద్ధతిలో సోమవారం సాయంత్రం ఏడు గంటలకు కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటలు, క్రీడల వల్ల పోటీతత్వం అలవడుతుందని, పేరుప్రతిష్టలు లభిస్తాయన్నారు. క్రీడలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు.

సెమీస్‌కు చేరిన పురుషుల జట్లు

పురుషుల విభాగంలో కృష్ణా, శ్రీకాకుళం, నెల్లూరు, విజయనగరం జట్లు సెమీస్‌కు చేరాయి. లీగ్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో నెల్లూరు జట్టు శ్రీకాకుళంపై 33–31, కృష్ణా జట్టు విజయనగరంపై 30–22, నెల్లూరు జట్టు పశ్చిమగోదావరిపై 24–17, కృష్ణా జట్టు గుంటూరుపై 37–22, శ్రీకాకుళం జట్టు పశ్చిమగోదావరిపై 41–13, విజయనగరం జట్టు గుంటూరుపై 29–14 తేడాతో గెలుపొందాయి.

మహిళల విభాగంలో..

శ్రీకాకుళం జట్టు విశాఖపట్నంపై 36–25, కృష్ణా జట్టు విజయనగరంపై 47–43 తేడాతో గెలుపొందాయి. మహిళల లీగ్ పోటీలు పొద్దుపోయే వరకు కొనసాగాయి. రిఫరీస్ బోర్డు కన్వీనర్ కే బాలు, రిఫరీలుగా ఎస్.మంగరాజు, ఎం.గణపతిరావు, బి.రామకృష్ణ, ఆర్.అప్పలస్వామి, కె.గోపిరాజు, బి.నాగేశ్వరరావు, పి.నరేంద్ర, వి.అనిల్, కె.జగదీష్ వ్యవహరించారు. కాగా ఫైనల్ మ్యాచ్‌లు బుధవారం జరగనున్నాయి. స్పోర్టింగ్ క్లబ్ అధ్యక్షులు రామిశెట్టి మురళీకృష్ణ, సెక్రటరీ తిరుమలశెట్టి వెంకట కృష్ణారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యన్నారాయణ, సబ్బినేని శ్రీనివాస్, దాసరి సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



రఘురామ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆక్వా రైతులు



మాట్లాడుతున్న మంతెన లక్ష్మీ నరసింహరాజు

సాక్షి, భీమవరం: ఏపీ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) కో–వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ పదవీకాలాన్ని పొడిగించడంతో ఆక్వా రైతులకు మరిన్ని మంచిరోజులు రానున్నాయని ఆక్వా రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాజు (జీకేఎఫ్) అన్నారు. రఘురామ్ పదవీకాలన్నీ పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులివ్వడంపై ఆనందం వ్యక్తం చేస్తూ మంగళవారం రఘురామ్‌కు సంఘం తరఫున పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా రఘురామ్ ఆక్వా రైతుల వెన్నంటే ఉంటూ రైతుల సంక్షేమం కోసం చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. రొయ్యల ధరలు నిలకడగా ఉండేందుకు గిట్టుబాటు ధర కల్పించడానికి, మేతల ధరలు పెరగకుండా, ఆక్వా జోన్ల మార్కింగ్‌లో జరిగిన తప్పుల సవరణ, విద్యుత్ సబ్సిడీ సమస్యలను గుర్తించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించినందుకు ముఖ్యమంత్రికి, రఘురామ్‌కు రైతుల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఆక్వా జోన్‌లోని 10 ఎకరాలలోపు విస్తీర్ణంలో సాగుచేస్తూ సబ్సిడీ పొందని రైతులందరికీ సబ్సిడీ అందించేందుకు, డీఎల్‌సీలో నోటిఫై జరిగి పర్మిషన్ కలిగిన రైతులు అందరూ సాగు చేసుకోవచ్చని, ఎవరి బెదిరింపులకు భయపడవద్దని రఘురామ్ భరోసా ఇచ్చినట్లు సుబ్బరాజు చెప్పారు. రఘురామ్‌ను కలసిన వారిలో ఆక్వా రైతు సంఘం అదనపు కార్యదర్శి మళ్ల తులసీరామ్ (రాంబాబు), భోగిరెడ్డి శ్రీనివాసరావు, నాగరాజు గోపిరాజు తదితరులు పాల్గొన్నారు.

రొయ్య రైతుల సంఘం హర్షం

పాలకోడేరు: అప్సడా కో–వైస్ చైర్మన్ వడ్డి రఘురాం పదవీకాలాన్ని మరో రెండేళ్లు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై పశ్చిమ గోదావరి జిల్లా రొయ్య రైతుల సంఘం ఉపాధ్యక్షులు మంతెన లక్ష్మీనరసింహరాజు (పెదచంటి) హర్షం వ్యక్తం చేశారు. కోరుకొల్లులో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆక్వా కల్చర్ కార్యకలాపాలన్నీ ఒకే గొడుగు కిందకు తీసుకురావడంతో పాటు వాటికి చట్టబద్ధత కల్పించే లక్ష్యంతో అప్సడా చట్టాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. అప్సడాకు చైర్మన్‌గా సీఎం వ్యవహరిస్తున్నారన్నారు. సంక్షోభంలో ఉన్న ఆక్వా రైతుల సంక్షేమం కోసం రెండేళ్లుగా రఘురాం చేస్తున్న సేవలను గుర్తించిన సీఎం వైఎస్ జగన్ మరో రెండేళ్ల పాటు పదవీకాలాన్ని పొడిగించడం అభినందనీయమన్నారు. ఫీడ్ ధరలను నియంత్రించేలా రఘురాం కీలకపాత్ర పోషించారన్నారు. ప్రతి 15 రోజులకోసారి రొయ్యల ధరల హెచ్చుతగ్గులను పర్యవేక్షిస్తూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి కృషి చేస్తున్నారన్నారు. ఆక్వా రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

డిసెంబర్ 26 నుంచి జాతీయ సౌర్య కళా ఉత్సవం



ఏఎస్ఆర్ భవనంలో 2023 బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న సేవా సమితి సభ్యులు

భీమవరం (ప్రకాశం చౌక్): అల్లూరి సీతారామరాజు సేవా సమితి, శ్రీ విద్యా చారిటబుల్ ట్రస్టు (ఏలూరు) సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 26 నుంచి 28 వరకు జాతీయ సౌర్య కళా ఉత్సవం నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు చెప్పారు. మంగళవారం ఉత్సవం బ్రోచర్లను ఆవిష్కరించిన సందర్భంగా విలేకరులకు ఆయన వివరాలు వెల్లడించారు. 2019లో అల్లూరి సీతారామరాజు సేవా సమితి, శ్రీ విద్యా చారిటబుల్ ట్రస్టు (ఏలూరు) సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరులో ఈ సౌర కళాఉత్సవం నిర్వహించామన్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లో భీమవరం అల్లూరి సీతారామరాజు సేవా కేంద్రంలో డిసెంబర్ 26, 27, 28 తేదీల్లో మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ట్రస్టు నిర్వాహకురాలు గండికోట అలివేలు ఉష మాట్లాడుతూ ఈ కళా ఉత్సవంలో జాతీయ స్థాయిలో కూచిపూడి, భరతనాట్యం, కథక్, ఒడిశా, మణిపూర్ తదితర డ్యాన్స్ నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. కోల్‌కతా, ముంబై, పూణె తదితర ప్రాంతాల నుంచి ప్రముఖ నృత్య కళాకారులు ఈ ఉత్సవాల్లో ప్రదర్శనలిస్తారన్నారు. ప్రముఖ కథక్ డ్యాన్సర్ రాజేంద్ర గంగాని ఈ ఉత్సవాల్లో ఒక రోజు ప్రదర్శన ఇస్తారని తెలిపారు. సేవా సమితి ఉపాధ్యక్షుడు చేకూరి ఝాన్సీ లక్ష్మీబాయి, కార్యదర్శి చెరుకువాడ సుబ్రహ్మణ్యం, కార్యవర్గ సభ్యుడు ముదుండి సత్యనారాయణ రాజు, వేగేశ్న రామకృష్ణంరాజు, చేకూరి భీమరాజు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్‌లో రజతం



రావాడ కుసుమ

వీరవాసరం: జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ అండర్–23 విభాగంలో వీరవాసరానికి చెందిన రావాడ కుసుమ ప్రతిభ చూపి రజత పతకం సాధించింది. చండీగఢ్‌లో ఆదివారం జరిగిన పోటీల్లో లాంగ్ జంప్ విభాగంలో 6.09 మీటర్ల దూరం దూకి పతకం సాధించినట్లు ఆమె సోమవారం ఫోన్‌లో స్థానిక విలేకరులకు వెల్లడించారు. కుసుమ ఇటీవల బెంగళూరులో జరిగిన పోటీల్లోనూ కాంస్య పతకం సాధించింది.

సెంట్రింగ్ కూలీ మృతి

జంగారెడ్డిగూడెం: సెంట్రింగ్ పనులు చేస్తూ ఓ కూలీ భవనం పైనుంచి కింద పడి మృతి చెందాడు. పట్టిన్నపాలెంకు చెందిన గుళ్ల మంగరాజు (27) మంగళవారం జంగారెడ్డిగూడెం ఎంపీడీవో కార్యాలయం వెనుక సెంట్రింగ్ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు మంగరాజు నాలుగో అంతస్తు నుంచి కిందపడ్డాడు. తీవ్ర గాయాలపాలైన మంగరాజును స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా, ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏలూరు ఆశ్రం ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సేవలు భేష్

- రోగుల పాలిట సంజీవని జగనన్న ఆరోగ్య సురక్ష
- తణుకు నియోజకవర్గంలో ఇప్పటివరకు 45వేల మందికి వైద్యసేవలు..
- సీఎం జగన్‌కు రుణపడి ఉంటామంటున్న ప్రజానీకం..


తణుకులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు


తణుకులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రక్తపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల ఆరోగ్యానికి సంజీవనిలా పనిచేస్తోంది. పేదలందరికీ ఖరీదైన ఉచిత వైద్యాన్ని అందజేయాలనే తపనతో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజానీకం వేనోళ్ల పొగుడుతున్నారు. తణుకు నియోజకవర్గంలోని తణుకు మున్సిపాల్టీతో పాటు తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాలకు సంబంధించి ఇప్పటివరకు 51 వైద్య శిబిరాలు నిర్వహించగా సుమారుగా 45 వేలకు పైగా ప్రజలు వివిధ రుగ్మతలతో హాజరై ఉచిత వైద్యసేవలు పొందారు.

జల్లెడపట్టారు..
జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఉద్దేశాన్ని పూర్తిస్థాయిలో నెరవేర్చే క్రమంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం ప్రతి గడపలోను ప్రజల ఆరోగ్యస్థితిపై గతనెల 16వ తేదీ నుంచి జల్లెడ పట్టారు. వలంటీరు వ్యవస్థ ద్వారా వారి పరిధిలోని 50 ఇళ్లలో ఏఎన్ఎం టీం ద్వారా ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని పూర్తిగా తెలుసుకున్నారు. అంతేకాకుండా వారి ఇంటిలోనే సుగర్, బీపీ, రక్తశాత పరీక్షలు నిర్వహించి వైద్య శిబిరానికి రావాల్సిందిగా టోకెన్లు అందజేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సేవలిలా..
గతనెల 30 నుంచి ఈ వైద్య శిబిరాలు ప్రారంభం కాగా ఏఎన్ఎంలు ఇచ్చిన టోకెన్లు తీసుకుని ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజలు తరలివచ్చారు. ముందుగా శిబిరంలోని హెల్ప్ డెస్క్‌లో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకుని కేస్ షీటు ద్వారా సంబంధిత వైద్యులను కలిసే సదుపాయం కలుగజేశారు. ఈ శిబిరంలో జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్, కళ్లు, పంటి, ఆర్థోపెడిక్, మానసిక వైద్యులతోపాటు అన్ని విభాగాల వైద్యులను అందుబాటులో ఉంచారు. అంతే కాకుండా అందుబాటులో లేని విభాగానికి సంబంధించి టెలీ మెడిసిన్ ద్వారా రోగులను సంబంధిత వైద్యులతో మాట్లాడిస్తున్నారు. ఉచితంగా మందులు ఇస్తుండగా మెరుగైన వైద్యసేవలకు, శస్త్రచికిత్సలకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు సిఫార్సు చేస్తున్నారు. కంటి విభాగానికి సంబంధించి కళ్ల అద్దాలు సైతం ఉచితంగా అందించేందుకు వివరాలు సేకరిస్తున్నారు. దీంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి కారుమూరి చొరవతో...



తణుకు నియోజకవర్గంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతంగా జరుగుతోంది. పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఎప్పటికప్పుడు ఈ కార్యక్రమంపై మాతో మాట్లాడుతూ ప్రజలకు ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఆరా తీస్తున్నారు. శిబిరానికి వచ్చే ప్రజానీకానికి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. మధ్యాహ్న సమయంలో ఉన్నవారికి భోజనవసతి కల్పిస్తున్నాం.
– డాక్టర్ బి.దుర్గామహేశ్వరరావు, జగనన్న ఆరోగ్య సురక్ష నోడల్ ఆఫీసర్, తణుకు

సంతృప్తిగా ఉంది



తణుకులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఎంతో మంది పేదవర్గాలకు వైద్య సేవలందిస్తున్నాం. చాలా మంది దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతూ శిబిరానికి హాజరవుతున్నారు. ఈ కార్యక్రమం అటువంటి వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ కార్యక్రమంలో పాల్గొని వైద్యసేవలందించడం మాకు కూడా సంతృప్తిగా ఉంది.
– డాక్టర్ అశోక్ కుమార్, ఎండీ జనరల్ మెడిసిన్, తణుకు

ప్రజల వద్దకే వైద్యసేవలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చాలా బాగుంది. శిబిరంలో నాకు సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి ఈసీజీ కూడా తీశారు. ప్రజల వద్దకే వైద్యులను తీసుకురావడమే కాకుండా ఉచితంగా మందులు ఇచ్చి పంపించారు. చాలా సంతోషంగా ఉంది.
– జి.హనుమంతరావు, పైడిపర్రు

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాను



కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న నేను జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి వచ్చాను. సుగర్, బీపీ పరీక్షలే కాకుండా ఈసీజీ తీసి మందులు ఉచితంగా ఇచ్చారు. సుమారుగా నాకు రూ. 10వేలు విలువైన వైద్యాన్ని ఉచితంగా పొందినందుకు సీఎం జగన్‌కు రుణపడి ఉంటాను.
– సంగ అప్పారావు, తణుకు

ఉమర్ అలీషా ట్రస్టు సేవలు అద్భుతం


అత్తిలి మండలం బల్లిపాడు ఆశ్రమంలో మాట్లాడుతున్న పీఠం జిల్లా కన్వీనర్ వెంకట రత్నం

అత్తిలి: ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు చేస్తున్న సేవలు అద్భుతమని పలువురు వక్తలు కొనియాడారు. సామాజిక సేవ చేయాలనే సంకల్పంతో బల్లిపాడు గ్రామాన్ని దత్తత తీసుకున్నానని ఆకివీడుకు చెందిన డాక్టర్ దండుపద్మావతి అన్నారు. అత్తిలి మండలం బల్లిపాడు ఉమర్ ఆలీషా ఆశ్రమ ప్రాంగణంలో జరిగిన సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ సేవలను ఈ గ్రామంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా పీఠం కన్వీనర్ అడబాల నాగ వెంకటరత్నం మాట్లాడుతూ పీఠాధిపతులు ఉమర్ ఆలీషా జ్ఞాన సదస్సుల ద్వారా ఆధ్యాత్మిక తత్వాన్ని ప్రబోధించడమే కాకుండా ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలను కూడా చేస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆశ్రమ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రిటైర్డు ప్రిన్సిపాల్ ఆచంట సుబ్బారావు, దేవస్థానం ట్రస్టుబోర్డు ఛైర్మన్ తోట వెంకటేశ్వరరావు, అష్టావధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు ప్రగడ నాగేశ్వరరావు, విద్యాకమిటి ఛైర్మన్ ఆకుల మురళీకృష్ణ, ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్‌లు ఆకుల బులినాగేశ్వరరావు, ధనుమూరి వెంకటన్నబాబు, పీఠం సభ్యులు యర్రంశెట్టి శివన్నారాయణ, సీహెచ్ సత్యనారాయణ, సర్వమూర్తి, రిటైర్డు పోస్టు మాస్టర్ తలారి భద్రరావు, నిమ్మల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వృత్తిదారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు మామిడి దాన వర ప్రసాద్ డిమాండ్ చేశారు. ప్రగతి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ తాడేపల్లిగూడెం ఏరియా జనరల్ బాడీ సమావేశం మంగళవారం స్థానిక కోతి బొమ్మ సెంటర్‌లో యూనియన్ అధ్యక్షుడు బండి దుర్గా ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మామిడి దాన వరప్రసాద్ మాట్లాడుతూ వృత్తిదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో కార్యదర్శి చంద్రశేఖర్, పాండురంగారావు, వాసు, గంగాధర్, రాము, వెంకట్, రమణ, మస్తాన్, చిన్న, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

అఖండ అన్న సమారాధన

తాడేపల్లిగూడెం (టీఓసీ): దసరా మహోత్సవాలు సందర్భంగా పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ ఆలయం వద్ద మంగళవారం మహా అన్నప్రసాదం వితరణ కార్యక్రమం జరిగింది. పుర ప్రజలు, అమ్మవారి భక్తులు పాల్గొని అన్న ప్రసాదములు స్వీకరించారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ కొట్టు అంజిబాబు పర్యవేక్షించారు.
అన్నసమారాధన: కొబ్బరితోట శ్రీదేవి మహంకాళమ్మ దసరా మహోత్సవాలు సందర్భంగా నవదోయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షుడు యెగ్గిన నాగబాబు ఆధ్వర్యంలో మంగళవారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ ఛైర్మన్ వడ్డి రఘురాంనాయుడు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈతకోట తాతాజీ, పట్టణ ప్రముఖులు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించి అన్నప్రసాదాలు స్వీకరించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ


దువ్వలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో యాక్ట్ ఆఫ్ లవ్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. మంగళవారం దసరా సందర్భంగా గ్రామంలోని పేదలకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈకార్యక్రమంలో డాక్టర్ ఆశాలత, సృజన, లోకేష్, రిషితేజ, ప్రతిమ, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు కాగులంపాడులో కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం రాత్రి వెంకటేశ్వరుని కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు బడేటి ఉదయభాను, యర్రంశెట్టి బ్రహ్మసాయి, నాగమణి దంపతులతో పాటు, ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణం తిలకించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ చేశారు.

27న డీఆర్‌జీలో క్యాంపస్ డ్రైవ్

పెంటపాడు: మండలంలోని పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 27న బీఎస్సీ కెమిస్ట్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులకు క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జేకేసీ, హెటిరో కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ప్రత్యేక శిబిరంలో 2019 నుంచి 2023 వరకు బీఎస్సీ చదివి ఉత్తీర్ణులైన విద్యార్థులకు అవకాశం ఉంటుందన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద చెట్టుకు నిప్పు

సాక్షి, భీమవరం: స్థానిక తాలూకాఫీసు సెంటర్‌లోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో చెట్టుకు నిప్పంటుకోవడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. ఈ ఆవరణలో తహసీల్దార్ కార్యాలయంతో పాటు ట్రెజరీ, సబ్‌రిజిస్ట్రార్, కోర్టు వంటివి ఉన్నాయి. ఆ పక్కనే ఖాళీస్థలం ఉండడంతో అందులో చెట్లు పెరిగాయి. అయితే ఎంతోకాలంగా ఒక చెట్టు ఎండిపోయి ఉండడంతో ఎప్పుడు ఎవరిపై పడుతుందోనని భయపడేవారు. అయితే ఎండి చెట్టు ప్రాంతంలో చెత్తకు గుర్తుతెలియని వ్యక్తి నిప్పు పెట్టడంతో అది కాస్తా ఎండిన చెట్టుకు అంటుకుని మంటలు రేగాయి. సమాచారం అందుకున్న తహసీల్దార్ వై.రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్ అక్కడకు చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మంటలను అదుపు చేశారు. గునుపూడి ప్రాంతంలోని బేతనీపేట వద్ద చెత్తకు నిప్పంటుకోవడంతో ఆ మంటలు అగ్నిమాపక సిబ్బంది అదుపు చేశారు.

జయహో దుర్గాభవానీ...

- ముగిసిన దసరా ఉత్సవాలు
- గ్రామాల్లో సందడి వాతావరణం


తణుకు అర్బన్: కనకదుర్గమ్మ మండపంలో అమ్మవారిని దర్శించుకున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు


పెంటపాడు: మహిషాసురమర్దనిగా దర్శనమిస్తున్న వై. జంక్షన్ దుర్గమ్మ


తాడేపల్లిగూడెం (టీఓసీ): మహిషాసురమర్దనీగా శ్రీ వాసవి అమ్మవారు


తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రత్యేక అలంకరణలో సర్వమంగళమ్మ


అత్తిలి: ఆరవల్లిలో మహిషాసురమర్దని అలంకరణలో కనకదుర్గమ్మ


పెంటపాడు: కొండేపాడులో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


తణుకు అర్బన్: మహిషాసురమర్దని అలంకరణలో కామాక్షి దేవి

తణుకు అర్బన్: దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా విజయదశమి రోజున సోమవారం తణుకు పట్టణంలోని కనకదుర్గమ్మ తల్లి ఆలయాలు, వాసవీ కన్యకా పరమేశ్వరీ ప్రార్థనా మందిరంలోని వాసవి మాత, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో వేంచేసియున్న కనకదుర్గమ్మ తల్లిని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, సప్పా బలరామకృష్ణ, గుబ్బల సూర్యచంద్రరావు, కుడుపూడి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు. దేవి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శ్రీగోవిందమాంబ సమేత శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో వేంచేసియున్న కామాక్షి దేవి అమ్మవారు సోమవారం మహిషాసుర మర్దిని అవతారంలో దర్శనమిచ్చారు. పట్టణ స్వరకార సంఘం అధ్యక్షుడు పాడుగు రామాచారి (రాము) ఆధ్వర్యంలో నిర్వహించిన పూజాదికాల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ కొమ్మోజు రామకృష్ణ, వైస్ ఛైర్మన్ దవళేశ్వర సుబ్బారావు, కమిటీ సభ్యులు, స్వర్ణకార సంఘ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవార్లను దర్శించుకున్న మంత్రి కారుమూరి
అత్తిలి: అమ్మవారి చల్లని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆకాంక్షించారు. విజయదశమి పర్వదినం సందర్భంగా అత్తిలిలోగల శ్రీకనకదుర్గమ్మ అమ్మవారిని, శ్రీవిజయచాముండేశ్వరిదేవి, చినదానేశ్వరి అమ్మవార్లను మంత్రి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈసందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ఆలయ కమిటీ తరపున ఘనంగా సత్కరించారు. దేవిశరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా కనకదుర్గమ్మ శ్రీమహిషాసురమర్దని అలంకారంలో భక్తులక దర్శనమిచ్చారు. అత్తిలిలో శ్రీవిజయచాముండేశ్వరి, ఆరవల్లిలో శ్రీకనకదుర్గమ్మ అమ్మవార్లను శ్రీమహిషాసురమర్దనిదేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ముగిసిన దసరా ఉత్సవాలు
పెంటపాడు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో బుధ, గురు వారాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. దర్శిపర్రు పార్వతి బ్రహ్మలింగేశ్వరస్వామి వారి ఆలయంలో మంగళవారం అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమం వైభవంగా జరిగింది. ప్రత్తిపాడు కాగులంపాడు అమ్మవారి ఆలయం వద్ద గురువారం పెళ్లికాని యువకులతో పాలాభిషేకం నిర్వహించారు. గురువారం 1008 మంది కన్యలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి తెప్పోత్సవం నిర్వహించారు. పెంటపాడు ముసినాని వారి వీధిలోని అమ్మవారి ఆలయం వద్ద గ్రామ ఉప సర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. ప్రత్తిపాడు వై. జంక్షన్ అమ్మవారి ఆలయంలో బుధ, గురు వారాలు దసరా పర్వదినం పురస్కరించుకొని అమ్మవారిని దర్శించుకొనేందుకు భక్తులు పోటెత్తారు. ఆలయ ఈవో బళ్ల నీలకంఠం, ఛైర్మన్ సైపురెడ్డి రాంబాబు తదితరులు ఆలయకమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వీర్ల గోవింద్, వీర్ల సత్యనారాయణ, వెంకటేష్ తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసారు. దర్శిపర్రు పార్వతి బ్రహ్మలింగేశ్వరస్వామివారి ఆలయాల వద్ద కోడే కాళీ, కోల మార్కండేయులు, తదితరులు పాల్గొన్నారు.

వాసవి మాతకు వైభవంగా తెప్పోత్సవం
తాడేపల్లిగూడెం (టీఓసీ): దసరా మహోత్సవాలు 10వ రోజు మంగళవారం రాత్రి వాసవి పంచాయతన క్షేత్రంలో వాసవి అమ్మవారికి స్థానిక ఏలూరు కాలువలో తెప్పోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరైయారు. తొలుత ఆలయంలో మూలమంత్ర కమల రుద్ర ఆయుష్య అష్టోత్తర శత కమల హోమాలు, నవకన్య పూజలు, అమ్మవారి వద్ద ఉంచిన లడ్డూ వేలం పాట నిర్వహించారు. స్థానిక శంకర మఠంలో వేంచేసియున్న సర్వమంగళమ్మ వారిని మహిషాసుర మర్దినీ దేవిగా విశేష అలంకరణలు చేశారు. భక్తులు దర్శించారు.

మహిషాసురమర్దనిగా కామాక్షి దేవి
తణుకు అర్బన్: దేవి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శ్రీగోవిందమాంబ సమేత శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో వేంచేసియున్న కామాక్షి దేవి అమ్మవారు సోమవారం మహిషాసురమర్దిని అవతారంలో దర్శనమిచ్చారు. పట్టణ స్వరకార సంఘం అధ్యక్షుడు పాడుగు రామాచారి (రాము) ఆధ్వర్యంలో నిర్వహించిన పూజాధికాల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ కొమ్మోజు రామకృష్ణ, వైస్ ఛైర్మన్ దవళేశ్వర సుబ్బారావు, కమిటీ సభ్యులు, స్వర్ణకార సంఘ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

గూడెంలో సిద్ధార్థ హాస్పిటల్ ప్రారంభం


సిద్ధార్థ హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, హోంమంత్రి తానేటి వనిత

తాడేపల్లిగూడెం అర్బన్: విస్తృతంగా ఆసుపత్రులు ఏర్పాటు చేయడంతో తాడేపల్లిగూడెం పట్టణం వైద్యరంగంలో అభివృద్ధి సాధిస్తుందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో డాక్టర్ నూకల మహీధర్ నూతనంగా ఏర్పాటు చేసిన సాయి సిద్ధార్థ హాస్పిటల్‌ను మంగళవారం ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనరల్ సర్జన్ నిపుణులైన డాక్టర్ మహీధర్ హస్పిటల్‌ను నెలకొల్పడం శుభపరిణామమన్నారు. ఆసుపత్రులు పెరగడం ద్వారా వైద్యసేవలు ప్రజలకు మరింత అందుబాటులోకి వస్తాయని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు తానేటి శ్రీనివాస్, పుప్పాల మురళీకృష్ణ, వి రమాదేవి, యడ్లపాటి భవాని, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి భాస్కరరావు, ఆరేటి ప్రకాష్ కట్రెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

టైలర్స్ యూనియన్ సంఘటితంగా ఉండాలి


యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న భీమారావు

తణుకు: టైలర్లు సంఘటితంగా యూనియన్‌గా ఉంటూ వారి హక్కులను సాధించుకునేలా సీపీఐ, ఏఐటీయూసీ ఎప్పుడూ తోడుగా ఉంటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పేర్కొన్నారు. స్థానిక సురాజ్య భవన్‌లో శ్రీ గంగయ్య టైలర్స్ ప్రాథమిక సహకార సంఘం లిమిటెడ్ సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో తొలి కేంద్ర కార్మిక సంఘంగా ఆవిర్భవించిన ఏఐటీయూసీ పోరాటాల ఫలితంగా కట్టుబానిసత్వం నుంచి కార్మికులకు విముక్తి లభించిందన్నారు. కార్మిక హక్కులు, చట్టాలు సాధించుకోవడం జరిగిందని తెలిపారు. అనంతరం జిల్లా టైలర్స్ యూనియన్ అధ్యక్షుడు కొపెల్ల రామకోటేశ్వరరావు పట్టణ టైలర్లకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కత్తుల దానవీరవెంకటసుబ్బారావు, రెడ్డి సూర్యనారాయణ, నూతెళ్ల వెంకటరత్నం, గుత్తుకొండ సుబ్బారావు, పోతాబత్తుల ఈశ్వరరావు, తాతకుంట్ల పాండురంగారావు, రాసాబత్తుల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

సాక్షి, భీమవరం: స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీలోని శ్రీవెంకట సాయిబాబా మందిరంలో మంగళవారం విజయదశమి, ఏకాదశి సందర్భంగా సాయిబాబా 105వ సమాధి పుణ్యతిథి ఉత్సవాన్ని ఆలయ నిర్మాణకర్త మల్లినీడి తిరుమలరావు(బాబి) ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా బాబా విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, అనంతరం భక్తులతో సామూహికంగా శ్రీసాయి సత్యవ్రతాలు నిర్వహించారు. అలాగే బాబా దివ్య సమాధి పూజ, సామూహిక సహస్ర దీపోత్సవం, పల్లకి ఉత్సవాలను ఆలయ అర్చకుడు పి.నారాయణ శేషుకుమారాచార్యులు నేతృత్వంలో చేశారు. కార్యక్రమంలో మల్లినీడి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పడాల అయ్యప్పస్వామి ఆలయంలో బిక్ష ప్రారంభం


పడాల అయ్యప్ప స్వామి ఆలయంలో మాట్లాడుతున్న సేవాసమితి సభ్యులు

తాడేపల్లిగూడెం రూరల్ : మండలంలోని పడాల అయ్యప్ప స్వామి సేవా సమితి ఆలయ ప్రాంగణంలో దీక్షాధారులకు బిక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. కొవ్వూరి గాంధీరెడ్డి, వారి కుమారుడు హేమమిత్రారెడ్డి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు సోమవారం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గాంధీరెడ్డి కుటుంబ సభ్యులు 30 రోజులపాటు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు అయ్యప్ప సేవాసమితి అధ్యక్షుడు నిమ్మల వెంకటస్వామి (బాబ్జీ) తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గ్రంధి సత్యనారాయణ, కోశాధికారి ద్వారంపూడి దేవరాజ్ రెడ్డి, పూర్వాధ్యక్షుడు శానం గోవింద్, ఉపాధ్యక్షుడు సూరపు వెంకటేశ్వరరావు, కమిటి సభ్యులు గరిష్టపూడి సూరిబాబు, కోడూరి విజయకుమార్, ముత్యాల కృష్ణ, నల్లమిల్లి గాంధీరెడ్డి, కాళ్ళ అబ్బులు, అంగరాకుల బాలకృష్ణ, పేరిచర్ల మురళీ కృష్ణంరాజు, కామిశెట్టి సత్యనారాయణ, మండ సత్యనారాయణ, ఏవీ.రామరాజు పాల్గొన్నారు.

రేపు వాహనాలకు బహిరంగ వేలం

తణుకు: తణుకు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న మోటారుసైకిళ్లకు ఈనెల 26న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తణుకు రూరల్ పోలీసులు తెలిపారు. సంబంధిత మోటారు సైకిళ్ల యజమానులు వాటిని తీసుకెళ్లేందుకు ముందుకు రాకపోవడంతో వాటిని ఈనెల 26న ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా పోలీసు స్టేషన్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

26న అలంపురంలో ఉచిత వైద్యశిబిరం

పెంటపాడు: అలంపురం వెంకటరమణ చారిటీ ఆసుపత్రిలో ఈనెల 26న ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రికి చెందిన జనరల్ వైద్యులు, అంకాలజీ, గైనకాలజీ, పిల్లల వ్యాధుల నిపుణులు, గుండె వ్యాధి నిపు ణులు వచ్చి వైద్యపరీక్షలు చేస్తారన్నారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభించబోయే ఈ శిబిరాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.